నమస్తే తెలంగాణ

# యాదాద్రి భువనగిరి

I | హైదరాబాద్, గురువారం 20 ఫిబ్రవరి 2025 | YADADRI BHUVANAGIRI





తెలంగాణ భవన్‌లో సమావేశం హాజరు రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు, కంచర్ల భూపాల్‌రెడ్డి, బొల్లం మల్లయ్య యాదవ్

## బీఆర్‌ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో ఉమ్మడి జిల్లా నేతలు

**బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆ పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు, మాజీ జడ్పీ చైర్మన్లు, ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వ నమోదు, సిల్వర్ జూబ్లీ వేడుకలు, పార్టీ సంస్థాగత ఎన్నికలపై కేసీఆర్ దిశానిర్దేశం చేశారు.**




రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి



సమావేశ మందిరంలో మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, పైళ్ల శేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేత ఒంటెద్దు నర్సింహారెడ్డి



తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో దిశా నిర్దేశం చేస్తున్న పార్టీ అధినేత కేసీఆర్




సమావేశంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ యాదాద్రి జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ నేత క్యామ మల్లేశ్



నల్లగొండ మాజీ జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, బీఆర్‌ఎస్ నేత చాడ కిషన్‌రెడ్డి



మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, భాస్కర్‌రావు, మల్లయ్యయాదవ్, తిప్పన విజయసింహారెడ్డి



ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి



సూర్యాపేట, యాదాద్రి జడ్పీ మాజీ చైర్మన్లు గుజ్జ దీపికాయుగేందర్‌రావు, ఎలిమినేటి సందీప్‌రెడ్డి




బీఆర్‌ఎస్ నేతలు పల్లె రవికుమార్, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి

# మండుతున్న ఎండలు



## ఫిబ్రవరిలోనే సుర్రుమంటున్న సూర్యుడు

- **40 డిగ్రీలకు చేరువలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు**
- **రాత్రి పూటా పెరుగుతున్న టెంపరేచర్**
- **అధికమవుతున్న కరెంట్ వినియోగం**
- **వాతావరణ మార్పులతో వ్యాధులకు అవకాశం**
- **జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు**

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎండలు దంచికొడుతున్నాయి. వేసవి ప్రారంభం కాకముందే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. పలు ప్రాంతాల్లో 40 డిగ్రీలకు చేరువగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3-4 డిగ్రీల మేర ఎక్కువగా రికార్డవుతున్నాయి. తేమ శాతం తగ్గడంతో జనం ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

– యాదాద్రి భువనగిరి, జనవరి 19 (నమస్తే తెలంగాణ)

ఈసారి అప్పుడే భానుడు విశ్వరూపం చూపుతున్నాడు. సాధారణం కంటే మూడు నుంచి నాలుగు డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మధ్యాహ్నం వేళల్లో భగభగ మండుతున్న ఎండని చూసి ప్రజలు ఇండ్ల నుంచి బయటికి వచ్చేందుకు భయపడుతున్నారు. ఫిబ్రవరిలోనే ఎండలో ఇలా ఉంటే వచ్చే రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లాలోని రాజాపేటలో 37 డిగ్రీలు, ఆలేరులో 36.9, బీబీనగర్, రామన్నపేటలో 36.6 చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సూర్యాపేట జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 37.8 డిగ్రీలకు చేరుకున్నాయి. ఫిబ్రవరి 1 నుంచి ఇప్పటి వరకు 20 రోజుల్లో 4 డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరిగాయి. గతేడాది ఫిబ్రవరిలో 33 డిగ్రీల ఉష్ణోగ్రతలు మాత్రమే రికార్డ్ అయ్యాయి. మరోవైపు రాత్రి ఉష్ణోగ్రతలు కూడా పెరిగిపోతున్నాయి. మండే ఎండలకు తోడు గాలిలో తేమ శాతం కూడా పడిపోతున్నది.

### మొదలైన ఏసీలు, కూలర్ల వాడకం

జిల్లాలో కరెంట్‌కు డిమాండ్ పెరిగిపోయింది. ఎండలు విపరీతంగా కొడుతుండటంతో విరివిగా విద్యుత్‌ను ఉపయోగిస్తున్నారు. గత నెలలో రోజుకు 8 మిలియన్ యూనిట్ల కరెంట్ వాడగా, ఇటీవల 9 మిలియన్ యూనిట్లకు పెరిగింది. ఎండలు, ఉక్కపోత ధాటికి తాళలేక ప్రజలు ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు వినియోగిస్తున్నారు. ఈ నెలాఖరులో 10 మిలియన్ యూనిట్లకు పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.



ఎండ వేడిమికి తాళలేక సూర్యాపేటలో గొడుగులు ఏర్పాటు చేసుకున్న వీధి వ్యాపారులు

### సీజనల్ వ్యాధులకు ఆస్కారం..

చలి కాలం పోయి, వేసవి వచ్చేస్తున్నది. దీంతోపాటు సీజనల్ వ్యాధులు కూడా దరి చేరే ప్రమాదం ఉంది. జ్వరం, జలుబు, అతిసారం, నీళ్ల వీరేచనాలు వంటి వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ సీజన్‌లో వచ్చే ఆటలమ్మ(చికెన్ పాక్స్), కామెర్లు వచ్చే ఆస్కారం ఉంది. గవద బిళ్లలు, టైఫాయిడ్ , పొంగు కూడా వ్యాపించే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



### ద్రవ పదార్థాలు తీసుకోవాలి..

ఎండలు ఎక్కువగా ఉండటంతో తప్పకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. ఆరు బయట పనిచేసే వారు సూర్యరశ్మి కాపాడుకునేలా జాగ్రత్త పడాలి. తరుచూ నీళ్లు తాగాలి. ఎక్కువగా నిమ్మరసం, కొబ్బరి నీళ్లు లాంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలి. తెలుపు రంగు, లేత రంగులు పలుచని కాటన్ వస్త్రాలు ధరించాలి. తలకు వేడి తగలకుండా టోపీ పెట్టుకోవాలి. ఓఆర్‌ఎస్ ద్రావణం తాగితే వడ దెబ్బ నుంచి కాపాడుకోవచ్చు. చంటిపిల్లలు, గర్భిణులు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్న వారు వడగాల్పులకు గురికాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. వడదెబ్బకు గురైన వారిని ప్రాథమిక చికిత్స అనంతరం స్థానిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాలి. కాఫీలు, టీలు అధిక వేడి సమయంలో తీసుకోకూడదు.

**పది రోజుల్లో నమోదైన ఉష్ణోగ్రతలు**

| తేది | కనిష్ఠ | గరిష్ఠ |
|---|---|---|
| 10 | 21.8 | 35.7 |
| 11 | 21.9 | 35.9 |
| 12 | 22.0 | 36.8 |
| 13 | 21.3 | 37.5 |
| 14 | 21.3 | 37.7 |
| 15 | 21.5 | 37.6 |
| 16 | 20.3 | 37.5 |
| 17 | 21.3 | 37.2 |
| 18 | 19.3 | 37.5 |
| 19 | 19.0 | 37.8 |



### పిల్లలు, వృద్ధులు జాగ్రత్తలు తీసుకోవాలి

చలి కాలం ముగుస్తున్నది. వేసవి సమీపిస్తున్నది. కాలం మారుతుండటంతో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది. నీరు ఎంత ఎక్కువ తీసుకుంటే అంత మంచిది. ఎండలో ఎక్కువగా తిరిగితే డయేరియా రావొచ్చు. చిన్న పిల్లలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలి. రానున్న రోజుల్లో వృద్ధులు వడదెబ్బకు గురికాకుండా చూసుకోవాలి.

**- డాక్టర్ అనిల్ రెడ్డి, జనరల్ ఫిజీషియన్, భువనగిరి**



# 'పది' మార్కులపై తనిఖీలు



పీఏపల్లి మండలంలోని జెన్‌కో డీఏవీ స్కూల్‌లో మార్కులు పరిశీలిస్తున్న జీహెచ్‌ఎం ఆర్.సాగర్, సభ్యులు

- **ఈ నెల 21 వరకు పరిశీలన**
- **ఉమ్మడి జిల్లాలో 1,162 పాఠశాలలు.. 39,209 మంది విద్యార్థులు**
- **కమిటీ నిర్ధారిస్తేనే ఇంటర్నల్ మార్కుల నమోదు**
- **ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 69 టీమ్‌ల ఏర్పాటు**

రామగిరి, ఫిబ్రవరి 19 : పదో తరగతి విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో ఇంటర్నల్ అసెస్‌మెంట్ పరీక్షలు పక్కాగా నిర్వహించారా, మార్కుల నమోదు ప్రతిభ ఆధారంగా నమోదు చేశారా, లేదా అనే అంశంపై తనిఖీలకు జిల్లా విద్యాశాఖ సిద్ధమైంది. ఈ మేరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని యాజమాన్యాల(ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్, గురుకుల) పరిధిలోని పదో తరగతి విద్యార్థుల మార్కుల నమోదును పరిశీలించనుంది. ఇందుకోసం నల్లగొండ జిల్లాలో గెజిటెడ్ హెడ్మాస్టర్లతో 69 బృందాలను నియమించింది. నల్లగొండ జిల్లాలో ఈ నెల 21, యాదాద్రి భువనగిరి జిల్లాలో ఈ నెల 20వరకు టీమ్‌లు పరిశీలించి మార్కులను నిర్ధారించనున్నాయి. ఆ తర్వాతే ఇంటర్నల్ మార్కులను ఎస్‌ఎస్‌సీ బోర్డు వెబ్‌సైట్‌లో నమోదు చేయనున్నారు. నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 540 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వాటిలో రాష్ట్ర ప్రభుత్వ, జడ్పీ స్కూళ్లు 229, మోడల్ స్కూళ్లు 17, కేజీబీవీలు 27, ఎయిడెడ్ పాఠశాలలు 17, అన్ ఎయిడెడ్ స్కూళ్లు 213, గురుకుల పాఠశాలలు 37 ఉన్నా యి. వాటన్నింటిలో కలిసి 2024-25 విద్యా సంవత్సరంలో 18,666 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. ఇక్కడ 69 బృందాలను ఏర్పాటు చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో 266 పాఠశాలలకుగానూ 178 జడ్పీ, మోడల్, కస్తూర్బా స్కూళ్లు, 14 గురుకులాలు, 74 ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. వాటిల్లో 8,631 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ 21 టీమ్‌లను ఏర్పాటు చేశారు. సూర్యాపేట జిల్లాలో 356 పాఠశాలలకుగానూ 11,912 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ 35 బృందాలను ఏర్పాటు చేశారు. అన్నిచోట్లా ఫార్మాట్ టెస్టులతోపాటు ప్రాజెక్టులు, రికార్డులు సంవత్సరం మొత్తం ఆయా సబ్జెక్టుల్లో ఉపాధ్యాయులు నిర్వహించి మార్కులు నమోదు చేసిన సంగతి తెలిసిందే. అవి సక్రమంగా ఉన్నాయా, లేదా అనే అంశాన్ని కమిటీలు నిర్ధారించనున్నాయి.

**టీమ్‌లోని సభ్యులు వీరే..**

డీఈఓ బి.భిక్షపతి ఆధ్వర్యంలో టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఒక్కో టీమ్‌లో ఒక గెజిటెడ్ హెడ్‌మాస్టర్, ఒకరు స్కూల్ అసిస్టెంట్, మరొకరు లాంగ్వేజి పండిట్‌ను నియమించారు. టీమ్ చైర్మన్ అయిన గెజిటెడ్ హెడ్‌మాస్టర్లతో సోమవారం సాయంత్రం డీఈఓ సమావేశం ఏర్పాటు చేసి సూచనలు ఇచ్చారు.

**పరిశీలించే అంశాలివే....**

అన్ని పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఇప్పటి వరకు రెండు ఎఫ్‌ఏ టెస్టులు మాత్రమే నిర్వహించారు. వీటితోపాటు ప్రాజెక్టులు, ఇతర రికార్డులనూ ప్రత్యేక బృందాలు పరిశీలిస్తాయి. ప్రతి ఎఫ్‌ఏ టెస్టుకు 5 మార్కుల చొప్పున నాలుగు టెస్టులకు 20 మార్కులు కేటాయిస్తాయి. సీసీఈ నిర్వహణ, ఎస్‌ఏ టెస్టుకూ మార్కులు కేటాయిస్తారు. పరీక్షలు, రికార్డుల నిర్వహణ సక్రమంగా నమోదు చేయకున్నా, తప్పులున్నా సరిచేస్తారు. ఆ తర్వాత జిల్లా పరీక్షల విభాగం ఆమోదంతో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మార్కులను ఎస్‌ఎస్‌సీ బోర్డుకు అందజేయాల్సి ఉంటుంది.

**ప్రైవేటులో బైకి బై!**

ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థుల నాణ్యత ప్రమాణాల మేరకే కచ్చితంగా నిబంధనల మేరకు మార్కులు ఇస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో మాత్రం బైకి బై మార్కులను వేస్తుండడం గత సంవత్సరం టీమ్స్ పర్యవేక్షణలో వెల్లడైంది. విద్యార్థుల పెర్ఫార్మెన్స్ సరిగ్గా లేకపోయినా ఎక్కువ మార్కులు వేయడంపై పలు పాఠశాలల్లో అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పర్యాయం పరిస్థితి ఎలా ఉందనేది తనిఖీల అనంతరం తేలనుంది.

### టీమ్‌లు నిర్ధారించాకే మార్కులు అప్‌లోడ్

పదో తరగతి విద్యార్థుల నైపుణ్యాల మేరకు అసెస్‌మెంట్, ప్రాజెక్టుల్లో మార్కుల నమోదు ఉంటేనే కమిటీలు ఫార్వర్డ్ చేస్తాయి. లేనిపక్షంలో వారికి ఏ స్థాయిలో మార్కులు ఉండాలో సూచించి నివేదికలను జిల్లా విద్యాశాఖకు అందజేస్తాయి. ఆ తర్వాత కమిటీ నిర్ధారించిన మార్కులనే పాఠశాలలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే ఆయా పాఠశాలలపై చర్యలు తప్పవు.

**- బి.భిక్షపతి, డీఈఓ నల్లగొండ**

# దూసుకొచ్చిన మృత్యుశకటం

- **హైదరాబాద్-విజయవాడ హైవేపై ఘోర ప్రమాదం**
- **డివైడర్‌ను దాటి అవతలి రోడ్డులో వెళ్తున్న కారును ఢీకొట్టిన మరో కారు**
- **తండ్రీకొడుకుల దుర్మరణం.. భార్య, తల్లి దండ్రులకు తీవ్ర గాయాలు**
- **మృతుల్లో ఐదు నెలల చిన్నారి**



ప్రమాదానికి గురైన కార్లు

చౌటుప్పల్, ఫిబ్రవరి 19 : హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం జరిగింది. అత్తగారింటికి కుటుంబంతో వెళ్తున్న వ్యక్తి కారుపైకి అతివేగంగా మరో కారు దూసుకొచ్చింది. డివైడర్ ఢీకొని అవతలి రోడ్డుపై ఉన్న కారు ను ఢీకొట్టడంతో తండ్రి, ఐదు నెలల కుమారుడు అక్కడికక్కడే మృతిచెందారు. భార్య పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని పటాన్‌చెరుకు చెందిన సాయికుమార్(33), తన భార్య సింధూజ, ఐదు నెలల కుమారుడు వీరాన్స్, తల్లిదండ్రులతో కలిసి బుధవారం సాయంత్రం సూర్యాపేటలోని అత్తగారింటికి కారులో బయల్దేరాడు. సాయంత్రం 6 గంటల సమయంలో చౌటుప్పల్ మండల పరిధిలోని దండు మల్కాపురం వద్దకు చేరుకోగా.. విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు అతివేగంగా డివైడర్‌ను ఢీకొట్టి అవతలి వైపు రోడ్డులో ఉన్న సాయి కుమార్ కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయికుమార్, వీరాన్స్ అక్కడికక్కడే మృతిచెందాడు. సాయికుమార్ భార్య, తల్లిదండ్రులకు తీవ్ర గాయాలయ్యాయి. ఢీకొట్టిన కారులో ఉన్న ఇద్దరు కూడా గాయపడ్డారు. వాళ్లు వెంటనే ప్రైవేట్ వాహనంలో హైదరాబాద్‌లోని ఆస్పత్రికి వెళ్లారు. సాయికుమార్ భార్య, తల్లిదండ్రులను చౌటుప్పల్ పోలీసులు హైదరాబాద్‌లోని కామినేని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వేసవిలో తాగునీటి ఎద్దడి ఉండొద్దు

- **భువనగిరి పట్టణంలో ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్న కలెక్టర్**



పట్టణంలోని 7వ వార్డులో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 19 : ప్రతిరోజూ కృష్ణా నీళ్లు సరిపోను వస్తున్నాయా.. అందరు ఏ నీళ్లు తాగుతున్నారు.. ఆర్‌ఓ వాటర్ తాగడం వల్ల కాళ్ల నొప్పులు వంటి సమస్యలు వస్తాయి.. కృష్ణా వాటర్‌ను వేడి చేసి తాగితే ఆరోగ్య సమస్యలు రావు' అంటూ కలెక్టర్ ప్రజలకు సూచించారు. భువనగిరి పట్టణంలోని 7వ వార్డులో బుధవారం కలెక్టర్ హనుమంతరావు ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొత్త రేషన్ కార్డులు వచ్చాయా, రేషన్ బియ్యం ప్రతినెలా వస్తున్నాయా అని ఆరా తీశారు. ప్రభుత్వం అందిస్తున్న గ్యాస్ సబ్సిడీ రూ.500 వస్తుందా అని నర్సింహ అనే వ్యక్తిని అడుగగా రావడం లేదని చెప్పడంతో వెంటనే సంబంధిత సివిల్ సప్లయ్ అధికారికి ఫోన్ చేసి ఆదేశించారు. 200 యూనిట్స్ ఉచిత విద్యుత్ రాని వారికి వచ్చే విధంగా చూడాలని సంబంధిత అధికారికి తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికి ఎంక్వయిరీకి వచ్చారా, రాని వారికి కొత్త అప్లికేషన్ చేయించాలని ఆర్‌పీకి సూచించారు. స్థానిక వార్డు మహిళల అభ్యర్థన మేరకు వార్డులో వాటర్ ట్యాంక్ నిర్మించాలని మున్సిపల్ కమిషనర్‌కు కలెక్టర్ ఆదేశించారు. ఎండాకాలం దృష్టిలో పెట్టుకుని ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా తగు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మురుగు నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా చూడాలని, తడి, పొడి చెత్త వేరు చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ గంగాధర్, మున్సిపల్ కమిషనర్ రామలింగం, డీఈ కొండల్ రావు తదితరులు ఉన్నారు.

# జాన్‌పహాడ్ దర్గా మరుగుదొడ్ల నిర్మాణంపై విచారణ

**'ప్రభుత్వ నిర్మాణానికి ప్రైవేట్ రంగు' కథనానికి స్పందన**

పాలకవీడు, ఫిబ్రవరి19 : మండలంలోని జాన్‌పహాడ్ దర్గా వద్ద నిర్మించిన మరుగుదొడ్లపై స్థానిక అధికారులు విచారణ చేసి బుధవారం కలెక్టర్‌కు నివేదిక అందించారు. ఈ నెల 18న నమస్తే తెలంగాణలో 'ప్రభుత్వ నిర్మాణానికి ప్రైవేట్ రంగు' అనే వార్తా కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన కలెక్టర్‌తోపాటు జిల్లా అధికారులు విచారణకు ఆదేశించింది. మండల ఎంపీడీఓ లక్ష్మిని విచారణ అధికారిగా నియమించారు. దీంతో ఆమె పూర్తి వివరాలు సేకరించారు. ఉర్సు సందర్భంగా జాన్‌పహాడ్ దర్గా గ్రామంలో డీఎంఎఫ్‌టీ ప్రభుత్వ నిధులతో నిర్మించిన మరుగుదొడ్లపై కొందరు ప్రైవేట్ సంస్థ పేరు రాయించారని, ఆ తర్వాత పేరును తొలగించి వేరే రంగు వేశారని నిర్ధారించారు. మరుగుదొడ్లు నిర్మించిన కాంట్రాక్టర్‌తోపాటు పంచాయతీ రాజ్, వక్ఫ్‌బోర్డు అధికారి వివరణ తీసుకున్నామని, సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులకు అందజేశామని ఎంపీడీఓ లక్ష్మి తెలిపారు.